నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
13 | హైదరాబాద్, శనివారం 3 ఫిబ్రవరి 2024 | RANGAREDDY

ప్రతి కుటుంబానికీ వంద రోజులు పని కల్పించాలి

-జిల్లా కలెక్టర్ శశాంక

కలెక్టర్ శశాంకకు కేక్ తినిపిస్తున్న ఉద్యోగులు

రంగారెడ్డి, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ప్రతి కుటుంబానికీ వంద రోజులు పని కల్పించాలని కలెక్టర్ శశాంక సూచించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 18వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్డీఏ అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్డీఏ అదనపు పీడీ నీరజ, ఏపీవో నాగ భూషణం తదితరులు పాల్గొన్నారు.

అనుమతులిచ్చి.. ఆపై దుష్ప్రచారం..

దామగుండం నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు ఫైల్‌ను దుమ్ము దులిపి అనుమతిచ్చామని చెప్పిన మంత్రి కొండా సురేఖ, వెనువెంటనే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అనుమతులు వచ్చాయంటూ దుష్ప్రచారం చేయడం తగదు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రాడార్ కేంద్రం ఏర్పాటుపై విపరీతమైన ఆతృతగా ఉన్నారు. ఉద్యమకారులను నిర్వీర్యం చేసే విధంగా ఎమ్మెల్యే మాట్లాడుతున్నారు. జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి అన్యాయం చేస్తున్నారు, రాడార్ కేంద్రం బదులు అప్పా నుంచి వికారాబాద్ హైవే పనులు చేపట్టాలి.

- జి.నాగేందర్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మరోసారి ఆలోచించాలి..

నేవీ రాడార్ సెంటర్ ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరోసారి ఆలోచించాలి. రాడార్ సెంటర్‌తో ఎదురయ్యే దుష్పరిణామాలను గ్రామ గ్రామాన తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలి. చాలా గ్రామాల్లోని ప్రజలకు ఈ విషయం తెలియదు. మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని తెలియజేయడం ద్వారా ఉద్యమం మరింత ఉధృతం అవుతుంది.

-సాయన్న, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

రామన్న తరాలకు రాడార్ శాపం

'ప్రకృతి విధ్వంసం-పరిణామాల'పై చర్చావేదికలో వక్తలు

రాడార్ కేంద్రం ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పరిగి, ఫిబ్రవరి 2 : పూడూరు మండల కేంద్రం సమీపంలోని దామగుండంలో నేవీ రాడార్ సెంటర్ ఏర్పాటైతే భవిష్యత్ తరాలకు ముప్పేనని పలువురు అభిప్రాయపడ్డారు. సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి వికారాబాద్ జిల్లా ప్రజల బతుకుల్లో మన్ను పోస్తున్నదని, సొంత జిల్లా ప్రజల జీవితాలతో ఆటలాడుకోవడం సీఎం రేవంత్‌రెడ్డికి తగదన్నారు. శుక్రవారం పరిగిలోని బృందావన్ గార్డెన్‌లో దామగుండంలో నేవీ రాడార్ సెంటర్ ఏర్పాటుపై దామగుండం అడవి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 'ప్రకృతి విధ్వంసం-పరిణామాలు' అనే అంశంపై చర్చావేదిక జరిగింది. ఇందులో పలువురు మాట్లాడడంతోపాటు పలు తీర్మానాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఆగమేఘాలమీద పాత ఫైల్ దుమ్ముదులిపి నేవీ రాడార్ సెంటర్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో వద్దని వ్యతిరేకిస్తే ఇక్కడ ఎందుకు ఏర్పాటు చేస్తున్నారన్నారు. సముద్రమట్టానికి ఎత్తైన ప్రాంతంలో ఉండే అనంతగిరి-దామగుండం జంట అడవుల్లో 12 లక్షల చెట్లను నరికివేస్తే జిల్లాతోపాటు చుట్టుపక్కల జిల్లాల్లోనూ వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నేవీ రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే దాని రేడియేషన్ ప్రభావం సుమారు 40 నుంచి 50 కిలోమీటర్ల వరకు ఉంటుందని పర్యావరణవేత్తలు చెబుతున్న దృష్ట్యా, ఆ ప్రభావం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సైతం ముప్పుగానే పరిణమిస్తుందని హెచ్చరించారు. సహజసిద్ధంగా అడవిలో మొలచిన ఔషధ మొక్కల నరికివేతతో 'అనంత గిరికా హవా.. సౌ మరీజోంకా దవా' అనే నానుడిగా మారుతుందన్నారు. రేడియేషన్ ప్రభావంతో చర్మవ్యాధులు, క్యాన్సర్, ఇతర వ్యాధులతో వన్యప్రాణులు, మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. పాశ్చాత్య దేశాలు వద్దనుకున్న ఎల్ ఎఫ్ఎల్ రాడార్ సిస్టమ్‌ను భారత ప్రభుత్వం ఎందుకు ఏర్పాటు చేస్తున్నదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ది ప్రజా ప్రభుత్వంగా చెప్పుకొంటున్న సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే.. భవిష్యత్ తరాలకు తీరని నష్టం జరిగే రాడార్ కేంద్ర ఏర్పాటును ఎందుకు నిలిపివేయడం లేదన్నారు. ఏదైనా క్వారీకి అనుమతికోసం దరఖాస్తు చేస్తే పర్యావరణ అనుమతులు కోరే పాలకులు 3,000 ఎకరాల్లో ఏర్పాటుచేసే రాడార్ కేంద్రానికి పర్యావరణ అనుమతులు ఎలా వచ్చాయన్నారు. రాడార్ కేంద్ర ఏర్పాటుకు సంబంధించిన ఫైల్ దుమ్ము దులిపి తుది అనుమతులు ఇచ్చామని చెప్పిన మంత్రి కొండా సురేఖ, ఆ వెనువెంటనే గత ప్రభుత్వమే ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చిందని, రాడార్ కేంద్రంతో చీమకు కూడా హాని జరుగదని చెప్పడం ఆమె అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. రాడార్ కేంద్రం ఏర్పాటుపై అపోహలను నివృత్తి చేయాల్సిన ప్రభుత్వం.. దాని ఏర్పాటును పునఃపరిశీలించాలని కోరుతూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిపై అభివృద్ధి నిరోధకులు అనే ముద్ర వేయాలని చూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుకు రూ.2500 కోట్లు మంజూరు చేయించానని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందంటూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని వారు విమర్శించారు. ఆ కేంద్రం ఏర్పాటైతే ఎలాంటి ప్రగతి ఉండదని.. ఉద్యోగాలూ రావన్నారు. నేవీ రాడార్ కేంద్ర ఏర్పాటుతో కలిగే దుష్ప్రభావాలపై ఇంటింటికీ తిరిగి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ఈ ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములయ్యేలా చూడడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాల్లో లొసుగులపై కోర్టుల్లో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలను దాఖలు చేయాలని తీర్మానించారు. మరోవైపు ఈ నెల 5న కొడంగల్‌కు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేయాలని, అంతకుముందే అసెంబ్లీ స్పీకర్‌కు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రజాఉద్యమంలో భాగంగా దామగుండంలోని రామలింగేశ్వరాలయంలో 2వేల మందితో 2 వేల కొబ్బరికాయలు కొట్టే కార్యక్రమాన్ని చేపట్టడంతోపాటు కలెక్టరేట్ ముట్టడికి కార్యాచరణను సిద్ధం చేయాలని తీర్మానించారు. అలాగే దామగుండం ఆలయానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లేదా కేటీఆర్‌ను తీసుకొచ్చేందుకు ప్రయత్నిద్దామని.. నేవీ రాడార్ వ్యతిరేక పోరాటంలో జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులందరూ భాగస్వాముల యేలా చూద్దామన్నారు. జేఏసీ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్ మాట్లాడుతూ రాడార్ కేంద్రం ఏర్పాటుతో రేడియేషన్ ప్రభావం వల్ల కలిగే నష్టాలపై సీఎం, మంత్రులు వాస్తవాలు ప్రజలకు వివరించాలన్నారు. అపోహలు నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యమ నాయకుడు దేవనోనిగూడెం వెంకటయ్య మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే అనేక దుష్ప్రభావాలతో తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. నాయకుడు రాజలింగం మాట్లాడుతూ పూడూరు గ్రామపంచాయతీ తీర్మానం, రాజకీయ పార్టీల తరపున విడివిడిగా కోర్టుల్లో కేసులు వేయాలన్నారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ ఆక్సిజన్ పుష్కలంగా లభించే అడవుల నరికివేతతో హైదరాబాద్‌కు ముప్పు తప్పదన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు బి.రవికుమార్ మాట్లాడుతూ నలుగురికి ఉపయోగపడే పథకాలను రద్దు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఏ ఒక్కరికి ఉపయోగం లేని రాడార్ కేంద్రం ఏర్పాటును ఎందుకు రద్దు చేయడం లేదన్నారు. మాజీ ఉపసర్పంచ్ రాజేందర్ మాట్లాడుతూ నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటును అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించడం తగదన్నారు. మంచన్‌పల్లి మాజీ డైరెక్టర్ సత్యం మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను హరించే రాడార్ సెంటర్ రద్దుకు మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ముందుకొచ్చి పోరాడాలన్నారు.

ప్రజా ఉద్యమంతో ప్రభుత్వాన్ని లొంగదీద్దాం..

దామగుండంలో నేవీ రాడార్‌పై బలమైన ప్రజా ఉద్యమాన్ని చేయడం ద్వారా ప్రభుత్వాన్ని లొంగదీద్దాం. ప్రజల ఉద్యమానికి అనేక ప్రభుత్వాలు లొంగాయి. భూమి కోసం, ఆక్సిజన్ కోసం ప్రపంచమంతా ఉద్యమాలు కొనసాగుతుంటే ఇక్కడ అడవుల నరికివేతతో జన జీవనాన్ని అస్తవ్యస్తం చేసే ప్రయత్నం జరుగుతున్నది. సెల్‌ఫోన్ టవర్ల వల్ల రేడియేషన్‌తో ఊరపిచ్చుకలు మొదలుకొని మానవళి మనుగడ కనుమరుగవుతుంది. రాడార్‌తో భవిష్యత్తు తరాలకు ప్రమాదం పొంచి ఉన్నది. సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి తప్ప విధ్వంసం జరిగేలా ఉండకూడదు.

- బి.విజయకుమార్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్

అభివృద్ధి, ఉద్యోగాలంటూ ప్రచారం

నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉద్యోగాలు వస్తాయంటూ ఓ నాయకుడు ప్రచారం చేస్తున్నారు. ప్రకృతి సిద్ధమైన అడవిని నాశనం చేస్తూ అభివృద్ధి అంటే ఊరుకోకూడదు. రాడార్ కేంద్రంతో ఉద్యోగాలనేది అసత్యం. లక్షలాది మొక్కల నరికివేతతో పర్యావరాణానికి ఎంత నష్టమనేది అంచనా వేయకుండానే ఏర్పాటుకు పూనుకున్నారు. రాడార్ కేంద్రం కాకుండా.. ఉపగ్రహాల ద్వారా సైతం సిగ్నల్స్ పంపించే పద్ధతిలో ఎవరికీ నష్టం ఉండదు. రాడార్ కేంద్రం ఏర్పాటు దేశరక్షణకు సంబంధించింది, దీన్ని అంగీకరిస్తేనే దేశభక్తులు అన్నట్లుగా మంత్రి మాట్లాడారు. 600 ఎండ్లనాటి దామగుండం క్షేత్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నది.

-మురళీధర్ దేశ్‌పాండే, దామగుండం అడవి పరిరక్షణ సమితి అధ్యక్షుడు

రేడియేషన్ ప్రభావంపై అవగాహనతో ఉద్యమించాలి..

రాడార్ కేంద్రం ఏర్పాటు ద్వారా రేడియేషన్ ప్రభావంతో కలిగే నష్టంపై పూర్తి అవగాహన ఏర్పర్చుకొని యువత ఉద్యమించాలి. నేటి యువతరానికి అవసరమైన సమాచారం అందిస్తా. రేడియేషన్ ప్రభావంతో పలు రకాల క్యాన్సర్లు, చర్మ వ్యాధులు వస్తాయని చెబుతున్నారు. తాగు నీటికి ఇబ్బంది కలుగుతుంది. రేడియేషన్ దుష్ప్రభావంపై డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది. తెలంగాణ దేశంలోనే అత్యంత సేఫ్ ప్లేస్, ఎలాంటి భూకంప ప్రభావిత ప్రాంతం కాదు, ఇలాంటి చోట రాడార్ కేంద్రం ఏర్పాటుతో పాటు లక్షలాది చెట్ల నరికివేతతో పూర్తిగా నాశనం అవుతుంది. ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధమైతే పూర్తి అవగాహనతో ప్రశ్నలడిగి రాడార్ ఏర్పాటును అడ్డుకోవాలి.

- సత్యానందస్వామి, దామగుండం ప్రకృతి ప్రేమికుడు

పోరాటంతో రాబోయే తరాలకు మేలు..

ఈ ప్రాంతంలో అడవిని రక్షించుకునేందుకు, జీవన విధ్వంసం జరగకుండా చూసేందుకు రాడార్ కేంద్రం ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాటం చేయడం ద్వారా రాబోయే తరాలకు మేలు జరుగుతుంది. ఈ ప్రాంత ప్రజలకు ఉద్యమం కొత్తకాదు, తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపిన చరిత్ర ఉన్నది. రూ.2500కోట్లతో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుతో అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. అడవులు, మానవాళికి నష్టం జరుగుతుందని ఉద్యమం ప్రారంభం కావడంతో ఎమ్మెల్యే తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రకృతిపైనే మానవ మనుగడ ఆధారపడి ఉన్న తరుణంలో అత్యంత ప్రమాదకరమైన రాడార్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలి.

- బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నార్మాక్స్ మాజీ డైరెక్టర్

చెట్టుకు ఒకరం నిలబడి కాపాడుకుంటాం

రాడార్ కేంద్రం ఏర్పాటుపై ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తే చెట్టుకు ఒకరం చొప్పున నిలబడి అడవిని కాపాడుకుంటాం. పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో హైదరాబాద్ వారు సైతం పాల్గొనేలా కార్యాచరణ రూపొందించి, ప్రభుత్వం మెడలు వంచి అడ్డుకట్ట వేద్దాం. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల వారు ఈ ఉద్యమంలో పాల్గొనడం ద్వారా రాడార్ కేంద్రం ఏర్పాటును అడ్డుకుందాం. దామగుండం అడవిని కాపాడుకుంటేనే స్వచ్ఛమైన గాలి పీల్చుకోగలుగుతాం. లేదంటే ప్రజా జీవన విధ్వంసం జరుగుతుంది.

- సునంద, అడవి పరిరక్షణ ఉద్యమ నాయకురాలు

అభివృద్ధి నిరోధకులుగా ఉద్యమకారులపై ముద్ర

స్వచ్ఛమైన వాతావరణం గల దామగుండం పరిరక్షణకు పోరాడుతున్న వారిపై అభివృద్ధి నిరోధకులుగా పాలకులు ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో అనేక ఉద్యమాలు చేసిన తాము ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేశాం. ఏ ఒక్కరి కోసమో ఈ ఉద్యమం చేయడం లేదు. ఎలాంటి కుయుక్తులు పన్నినా ప్రజా ఉద్యమాల ముందు నిలవవు. ఇప్పటికే అన్ని వర్గాల్లో చర్చ ప్రారంభమైంది. ఉద్యమాన్ని ప్రత్యేక కార్యాచరణతో ముందుకు తీసుకువెళ్తాం.

- రామన్నమాదిగ, ఉద్యమ నాయకుడు

రాడార్ రద్దు కోసం జైలుకైనా వెళ్తా..

నేవీ రాడార్ సెంటర్ రద్దుకు జైలుకు వెళ్లేందుకూ సిద్ధమే. వన్యప్రాణుల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. రాడార్ సెంటర్ నుంచి వచ్చే రేడియేషన్ ప్రభావంతో 60 శాతం మందికి పిల్లలు పుట్టే అవకాశం ఉండదని నిపుణులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీంతో భవిష్యత్ తరాలకు ముప్పే.

-గోవిందనాయక్, ఎల్‌హెచ్‌పీఎఫ్ నాయకుడు

559 జీపీలకు 252 మంది..

గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్ల నియామకం

బాధ్యతలు స్వీకరించిన 252 మంది గెజిటెడ్ అధికారులు

ఒక్కొక్కరికీ మూడు జీపీల వరకు బాధ్యతలు

రంగారెడ్డి, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ):జిల్లాలోని 559 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన శుక్రవారం నుంచి ప్రారంభమైంది. అన్ని పంచాయతీలకు కలిపి మొత్తం 252 మంది గెజిటెడ్ అధికారులకు స్పెషల్ ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగించారు. గెజిటెడ్ అధికారుల కొరతతో ఒక్కొక్కరికి రెండు, మూడు గ్రామ పంచాయతీల చొప్పున బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా పాలకవర్గాల నుంచి రికార్డులు, చెక్ బుక్కులు, డిజిటల్ సంతకాల కీలను స్వాధీనం చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొత్తగా ఏర్పాటైన షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ మండలంలోని అంతిరెడ్డిగూడ గ్రామ పంచాయతీకి సైతం స్పెషల్ ఆఫీసర్‌ను నియమించారు.

జాబితా రూపకల్పనకు తర్జన భర్జన..

మొదట గెజిటెడ్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, హెచ్ఎంలను ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ జాబితాను రూపొందించారు. గెజిటెడ్ అధికారులనే నియమించాలని ఆ తదుపరి ఆదేశాలు ఇవ్వడంతో మళ్లీ జాబితాలో మార్పులు చేర్పులు చేశారు. తర్జన భర్జనలు పడి గురువారం రాత్రి వరకు ఎంపీడీవోలు జాబితాలను రూపొందించి డీపీవో ద్వారా కలెక్టర్‌కు పంపించారు. జిల్లావ్యాప్తంగా 252 మంది గెజిటెడ్ అధికారులను గుర్తించారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీవోలు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ(మిషన్ భగీరథ), విద్యుత్ శాఖల ఈఈలు, సహాయ ఇంజినీర్లు, సమగ్ర శిశు అభివృద్ధి సేవా సంస్థ(ఐసీడీఎస్) సూపర్‌వైజర్లు, ఎంఈవోలు, వ్యవసాయ అధికారులు, పశు వైద్యాధికారులు, హెల్త్ సూపర్ వైజర్లు, హార్టికల్చర్ అధికారులతో జాబితాను రూపొందించారు. అయితే జిల్లాలో 559 గ్రామపంచాయతీలు ఉండడంతో గెజిటెడ్ అధికారుల కొరత ఏర్పడడంతో రెండు, మూడు పంచాయతీలను క్లస్టర్‌గా చేసి ఒక్కో స్పెషల్ ఆఫీసర్‌కు వాటి బాధ్యతలను అప్పగించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి

హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

హస్తంపార్టీని గెలిపిస్తే టేక్ ఇట్ ఈజీ 'గ్యారెంటీ' అంటారు

హామీలను అమలు చేయకుంటే ప్రజలే తిరగబడుతారు

ఏ పార్టీకైనా, నాయకుడికైనా కార్యకర్తలే పట్టుకొమ్మలు

పార్లమెంట్ ఎన్నికల్లో రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని.. ఆ పార్టీని గెలిపిస్తే టేక్ ఇట్ ఈజీ గ్యారెంటీ అంటారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని నర్సింగ్ ఫంక్షన్ హాల్‌లో వికారాబాద్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు ఊరుకోరని, ఎక్కువ రోజులు కాంగ్రెస్ ప్రభుత్వం మనుగడ సాగదన్నారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కారుకు స్పీడ్ బ్రేకర్ మాత్రమే పడిందని ఆయన స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ పదేండ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధిపైనే దృష్టిని కేంద్రీకరించి పార్టీ గురించి పట్టించుకోలేదని. ఇంటింటికీ తాగు,సాగు నీరు, విద్యుత్తు అందించేందుకు ప్రతిరోజూ 24 గంటలపాటు పని చేశామని.. రాజకీయాలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలను చేర్చామన్నారు. పథకాల అమల్లో కార్యకర్తలకు ప్రాధాన్యమివ్వకపోవడం పార్టీకి నష్టం చేసిందని, పార్టీ పరంగా, పథకాల పరంగా తెలిసో, తెలియకో చేసిన తప్పులతో నష్టం జరిగిందన్నారు. అదేవిధంగా 119 సీట్లలో మూడో భాగం 39 మందిని ప్రజలు గెలిపించారని, సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు ప్రచారం చేసి గెలిచిందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో ఉందంటే అది కేసీఆర్ క్రెడిటేనని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వానికి నీతి అయోగ్ సంస్థ ఎన్నో ప్రశంసలు ఇచ్చిందని.. పల్లెలు, హైదరాబాద్ నగరం ఎంతో అభివృద్ధి చెందిందని.. ఐటీలో ఎక్కువ ఉద్యోగాలు కల్పించి అన్ని రంగాల్లో తెలంగాణను నంబర్ వన్‌గా నిలబెట్టిన పార్టీ బీఆర్ఎస్ అని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా ప్రగతిభవన్‌లో 150 బెడ్‌రూంలు కట్టారని హస్తం పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేశారని.. ఇప్పుడు ప్రగతిభవన్‌లో ఉంటున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 150 బెడ్‌రూం, బంగారు నల్లాలను చూపించాలని డిమాండ్ చేశారు. ప్రగతిభవన్‌కు ఇనుప కంచెలు వేశారని జరిగిన ప్రచారం కూడా శుద్ధ తప్పేనని.. కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే ఏర్పాటు చేశారని ఎంత చెప్పినా ప్రజల్లోకి తప్పుడు సమాచారమే వెళ్లిందన్నారు. ఏ పార్టీకైనా, నాయకుడికైనా కార్యకర్తలే పట్టుకొమ్మలని.. కష్టమొచ్చినా, నష్టమొచ్చినా కలిసే ముందుకు పోవాలన్నారు. ఓడిపోయినందున కుట్రలను ఎదుర్కొని పార్టీని బతికించుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. పార్టీలో గ్రూపులు వద్దని.. అసెంబ్లీ ఎన్నికల్లో తగిలిన దెబ్బకు రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీకారం తీర్చుకోవాలని..అందుకోసం చేవెళ్ల ఎంపీగా మరోసారి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ రాష్ట్రం కోసమని.. చంద్రబాబు, వైఎస్సార్‌లాంటి వారిని ఎదుర్కొని 15 ఏండ్లు పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన ధీరుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికి పీసీసీ పదవి, సీఎం పదవి బీఆర్ఎస్ పార్టీ లేకుంటే, పోరాటం చేయకుంటే వచ్చేదా అని వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించాలని లేకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు సూచించారు. అవసరమైతే 39 మంది ఎమ్మెల్యేలం వచ్చి ధర్నా చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ చిత్తు చిత్తుగా ఓడిపోతుందని.. బీఆర్ఎస్ పార్టీ తరపున ఎవరూ పోటీ చేసినా గెలుస్తారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో వికారాబాద్ నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెబుదాం..

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేందర్‌గౌడ్ మాట్లాడుతూ అడవులను నరికి, రేడియేషన్‌కు గురిచేసే నేవీ రాడార్ సెంటర్ వద్దే..వద్దు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు చెందిన వాడు కాదు.. జిల్లా ప్రజలను మోసం చేస్తున్నాడు. సుపరిపాలన అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాలను కుదిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొంటున్నది. వికారాబాద్ జిల్లా కోసం ఎన్నో ఏండ్లు పోరాటం చేశాం. జిల్లా నుంచి ఒక్క గ్రామాన్ని తొలగించినా ప్రభుత్వానికి తగిన బుద్ధి తప్పదు. పార్లమెంట్ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ పోరాటం చేద్దాం.

హామీల అమలుకు పోరాడాలి..

'కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యే వరకూ ప్రజల తరపున పోరాడుదాం. బీఆర్ఎస్ శ్రేణులు తలుచుకుంటే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డి సులువుగా విజయం సాధిస్తారు. తాగు, సాగు నీరందించిన మహానుభావుడు కేసీఆర్. సమన్వయ లోపంతోనే వికారాబాద్ నియోజకవర్గంలో ఓటమి చేద్దాం. జరిగిన నష్టాన్ని పూడ్చుకొని పార్టీని మరింత బలోపేతం చేద్దాం' అని జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్ అన్నారు.

అబద్ధాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది..

- బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చింది. కార్యకర్తలెవరూ భయపడొద్దు.. ధైర్యంగా ఉండాలి. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. రం జిత్‌రెడ్డి నియోజకవర్గాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తున్నారు. కరోనా సమయంలో ప్రజలను ఆదుకున్నారు. సొంత డబ్బుతో వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. అదేవిధంగా జిల్లా ఏర్పాటు, మెడికల్ కాలేజీ, వికారాబాద్‌కు ఆర